# భారతదేశంలో విపత్తు నిర్వహణ వ్యవస్థ

భూమీమ్మద జీవం ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ప్రకృతివైపరీత్యాల ధాటికి అనేక జీవరాశులు మట్టిలో కలిసిపోయాయి. ఈ విశ్వంలోనే అత్యంత అభివృద్ధి చెందిన మానవుడు సైతం ప్రకృతి ముందు తలవంచాల్సి వస్తోంది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పటికి మనిషి విపత్తులను ఎదుర్కోవడంలో విఫలమవుతూనే ఉన్నాడు. ఈ విపత్తులను సంపూర్ణంగా నివారించలేకపోయినప్పటికీ ఓ సమగ్రమైన వ్యవస్థను అంటే ముందుగానే హెచ్చరించే సాంకేతికత, ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన సంస్థలు, త్వరితగతిన స్పందించే మానవ వనరులను ఏర్పరచుకున్నట్లయితే వాటి బారి నుంచి బయటపడవచ్చు.

## విపత్తులకు సంబంధించి కొన్ని గణాంకాలు

- రెడ్ క్రాస్, రెడ్ క్రిసెంట్ సొసైటీ విడుదల చేసిన ప్రపంచ విపత్తు నివేదిక, 2010 (World Disaster Report, 2010) ప్రకారం 2000-2009 మధ్య కాలంలో విపత్తుల బారిన పడిన వారిలో దాదాపు 85 శాతం మంది ఆసియాకు చెందినవారే.

- 2011లో UNISDR (United Nations International Strategy for Disaster Reduction) ప్రకారం దక్షిణాసియా,తూర్పు ఆసియా, పసిఫిక్ దేశాల్లో దాదాపు 90 శాతం మంది ప్రజలు వరదల బారిన పడుతున్నారు.

- దక్షిణాసియా దేశాల్లో భారత్, బంగ్లాదేశ్ అధికంగా విపత్తుల బారిన పడుతున్నాయి. మన దేశంలో ఏటా దాదాపు 200 మిలియన్ మంది వరదలకు గురవుతున్నారు.

- భారతదేశంలో Building Materials Technology Promotion Council (BMTPC) తయారుచేసిన Vulnerability Atlas ప్రకారం 58 శాతం భూకంపాలు, 12 శాతం(40 మిలియన్ హెక్టార్లు) వరదలు, 5700 కి.మీ. మేర తుఫానులు, సునామీల బారిన పడుతోంది. సాగవుతున్న భూమిలో 68 శాతం భూభాగం కరువు బారిన పడుతుంది.

- ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 1996-2010 మధ్యకాలంలో సంభవించిన విపత్తుల వల్ల దేశ జీడీపీలో 2 శాతం, రెవెన్యూలో 12.15 శాతం నష్టం వాటిల్లుతుంది.

- 2001లో భుజ్ భూకంపం, 2004లో హిందూమహాసముద్రంలో వచ్చిన సునామీ, 2005లో కాశ్మీర్ భూకంపం, 2008లో కోసీ వరదలు, 2009లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో వరదలు, 2010లో ఉత్తరాఖండ్‌లో వచ్చిన వరదల వల్ల ఆయా రాష్ట్రాలకు దాదాపు 80 వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. ఇది 2005-2010లో మధ్యకాలంలో విపత్తులకు కేటాయించిన నిధుల(21,333 కోట్లు) కంటే నాలుగు రెట్లు ఎక్కువ.

•1990–2000 దశాబ్దకాలంలో ఏటా విపత్తుల బారినపడి 4344 మంది మరణిస్తున్నారు. దాదాపు 30 మిలియన్‌ల మంది ప్రభావితులవుతున్నారు.

•1989లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1990–2000 దశాబ్దాన్ని అంతర్జాతీయ విపత్తుల నివారణ దశాబ్దంగా (International Decade for Natural Disaster Reduction) ప్రకటించింది. అప్పటి నుంచే అన్ని దేశాలు విపత్తులను ఎదుర్కోవడానికి ప్రణాళికలను రూపొందించడం ప్రారంభించాయి. 1999లో ఒరిస్సాలో సంభవించిన సూపర్ సైక్లోన్, 2001లో భుజ్‌లో సంభవించిన భూకంపం తీవ్రతను చూస్తే విపత్తుల నివారణకు ఒక సమగ్రమైన వ్యవస్థ ఆవశ్యకత బోధపడుతుంది.

భారతదేశం, ఇండోనేషియా, శ్రీలంక వంటి దేశాలపై 2004, డిసెంబరు 26న సునామీ విరుచుకుపడి వేలాది మంది ప్రాణాలు, ఆస్తులు బలి తీసుకుంది. ఈ దారుణం అనంతరం మానవ తప్పిదాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల తలెత్తే ఆపదలను సమర్థవంతంగా ఎదుర్కొని, సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ఒక సమగ్రమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. 1999 ఒరిస్సా సూపర్ సైక్లోన్ తర్వాత సంస్థాగత ఏర్పాట్లను సూచించడానికి ఓ ఉన్నతాధికార కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఒక రోడ్‌మ్యాప్ (National Disaster Framework) ను తయారు చేసింది. ఆ తర్వాత 'జాతీయ విపత్తు నిర్వహణ బిల్లు' ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును భారత పార్లమెంటు 2005, డిసెంబరు 12న ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఇది 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టం, 2005' గా డిసెంబరు 23 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో భాగంగా ఆపత్సమయ నిర్వహణకు ప్రధానమంత్రి అధ్యక్షుడిగా National Disaster Management Authority(NDMA)ని ఎనిమిది మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. దీనికి ఉపాధ్యక్షుడిగా కేబినెట్ హోదాలోని మంత్రిని నియమిస్తారు. మొదటి ఉపాధాక్ష్యుడు భారత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి ఎన్.సి.విజ్. ప్రస్తుత ఉపాధ్యాక్షుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మర్రి శశిధర్ రెడ్డి. ఇందులోని సభ్యులు విపత్తులకు లోనయ్యే రాష్ట్రాల్లో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. విపత్తుల నిర్వహణలో అత్యంత నిపుణులైన వారి సలహాలను సూచనలు తీసుకుంటారు. అత్యాధునిక సాంకేతికతతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఎటువంటి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కోగల సంస్థాగత యంత్రాంగాన్ని రూపొందిస్తారు. ఈ చట్టంలో భాగంగా...

National Disaster Management Authority (NDMA)

National Executive Committee (NEC),

National Disaster Response Force (NDRF),

National Institute of Disaster Management (NIDM),

National Disaster Mitigation Fund,(NDMF)

National Disaster Response Fund(NDRF)

State Disaster Management Authority (SDMA)

District Disaster Management Authority (DDMA) వంటి సంస్థలను ఏర్పాటు చేశారు.

## NDMA విధులు

1. విపత్తు నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, పథకాలు రూపొందించడం.
2. జాతీయ విపత్తు ప్రణాళికను అమోదించడం.
3. విపత్తు నిర్వహణకు రూపొందించిన ప్రణాళిక అమలయ్యేలా చూడటం, సమన్వయం కలిగి ఉండటం.
4. ఇతర మంత్రిత్వ శాఖలు రూపొందించిన విధానాలను పరిశీలించి ఆమోదించడం, విపత్తు నివారణ, ఉపశమనం కలిగించడంలో వాటికి సూచనలు చేయడం.
5. రాష్ట్రాల్లో పనిచేస్తున్న SDMA లకు మార్గదర్శకాలు రూపొందంచడం, సూచనలు చేయడం.
6. విపత్తులను ఎదుర్కోవడానికి కావాల్సిన నిధుల కోసం సిఫార్సులు చేయడం.
7. National Institute of Disaster Management నిర్వహణకు కావాల్సిన విధివిధానాలు రూపొందించడం.
8. విపతుల్లో భారీగా నష్టపోయిన పొరుగు దేశాలకు కేంద్ర ప్రభుత్వానుసారం సహాయం అందించడం

" ప్రజలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యంతో ఆపత్సయమంలో త్వరగా స్పందించి ఉపశమనం కలిగించగల వ్యవస్థను ఏర్పాటు చేసి, అత్యాధునిక సాంకేతికను సాధించి విపత్తులు లేని భారతదేశాన్ని నిర్మించాలనేది NDMA విధానం"

## విపత్తు నివారణకు తీసుకున్న చర్యలు:

1994 మేలో యొకొహామా సందేశం విపత్తు నివారణ, ఉపశమనానికి తగిన వ్యూహాన్ని కలిగి ఉండాలని చెప్పింది. భారతదేశంలో పదవ పంచవర్ష ప్రణాళికలో విపత్తుల గురించి సమగ్రమైన అధ్యాయాన్ని చేర్చారు. దీనిలో ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విపత్తులు సంభవించినపుడు ఉపశమనం కలిగిస్తే లాభం లేదు. వాటిని నివారించే మార్గాలు అన్వేషించాలని సూచించారు. ప్రతి రాష్ట్రం విపత్తులు నివారించే విధానాలు రూపొందించుకోవాలని సూచించారు. UNDP, USAID(United Nations Development Program, United States Agency for International Development), యూరోపియన్ యూనియన్ సహాయంతో విపత్తులకు గురవుతున్న 17 రాష్ట్రాల్లోని 169 జిల్లాల్లో Disaster Risk Management Programme ని ప్రారంభించారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో విపత్తు సమయంలో త్వరగా స్పందించి, ప్రథమ చికిత్స అందించడం, ఉపశమనం కలిగించడం, ఆశ్రయం కల్పించడంలో ప్రావీణ్యం కలిగిన ప్రత్యేక బృందాలను తయారు చేస్తారు. ఇప్పటికే 82 జిల్లాల్లో, ఎంపిక చేసిన 1046 గ్రామ పంచాయతీల్లో దాదాపు 29000 మందికి శిక్షణనిచ్చారు. దీంతో పాటు 18000 ప్రభుత్వ సంస్థలు, 865 ఇంజనీర్లు, 425 ఆర్కిటెక్ట్‌లకు శిక్షణనిచ్చారు.

1. విపత్తులపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి జాతీయ స్థాయిలో Awareness Generation Campaign ను ప్రారంభించారు.

2. బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్ట్‌లు, పోస్టాఫీసులు, ఆస్పత్రులు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు.
3.విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి 8, 9 తరగతుల సోషల్ స్టడీస్‌లో Central Board of Secondary Education (CBSE) వారు విపత్తులను ఒక పాఠ్యాంశంగా చేర్చారు.

4. రాష్ట్రాలు విపత్తులను ఎదుర్కోవడానికి తగిన ప్రణాళికలను ఏర్పరుచుకోవడానికి కావాల్సిన సమాచారంతో వివిధ సంస్థలు, నిపుణులు రూపొందించిన సమగ్ర సమాచారాన్ని అన్ని రాష్ట్రాలకు దాదాపు పది వేల పేజీల్లో అందిస్తున్నారు.

5. విపత్తులు సంభవించినపుడు త్వరగా స్పందించి దాని తీవ్రతను తగ్గించడానికి 8 బెటాలియన్లలో 144 ప్రత్యేక బృందాలకు శిక్షణనిస్తున్నారు. ఇదే విధంగా రాష్ట్రాలు, జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వారికి తగిన శిక్షణనివ్వాలని పేర్కొన్నారు.

6. ప్రత్యేకంగా, పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన వ్యక్తులు, అన్ని సదుపాయాలున్న 200 బెడ్ల మొబైల్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు.

7. సమగ్ర సమాచారాన్ని కలిగి ఉన్న వెబ్ ఆధారిత India Disaster Resource Network ను ఏర్పాటు చేశారు. దీనిలో విపత్తులను ఏలా ఎదుర్కోవాలి, ఏయే చర్యలు తీసుకోవాలి వంటి సమగ్ర, సమస్థ సమాచారం ఉంటుంది.

8. ఆపత్సమయాల్లో తక్షణమే స్పందించడానికి National Emergency Operation Centre/Network ను ఏర్పాటు చేశారు. దీనిలో అన్ని రకాల సమాచార మాధ్యమాల ద్వారా శాటిలైట్‌లు,(GPS) ఆయా రాష్ట్రాల విపత్తు నిర్వహణ కేంద్రాలకు అనుసంధానం చేసి ఉంటారు. GIS ఉపయోగించి 'National Database for Disaster Management (NDDM) ఏర్పాటు చేశారు.

9. రూ.2457 కోట్లతో అగ్ని ప్రమాద సర్వీసులను బలోపేతం చేశారు.

10. భారతదేశంలో దాదాపు 1.3 మిలియన్ హోంగార్డు వ్యవస్థ ఉంది. దీనిని బలోపేతం చేసి అన్ని రకాల విపత్తుల్లో సమర్థవంతంగా స్పందించేలా తీర్చిదిద్దుతారు.

11. ఈశాన్య రాష్ట్రాలు ఎక్కువగా విపత్తులకు గురవుతుంటాయి కాబట్టి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి దాదాపు 140 మంది అధికారులతో North-Eastern Council ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన విధివిధానాలు Shillong Declaration లో రూపొందించారు.

12. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతి రెండు సంవత్సరాలకొకసారి విపత్తులపై సమగ్ర సమాచారంతో ' డిజాస్టర్ అండ్ డెవలప్‌మెంట్' అనే జర్నల్‌ను ప్రచురిస్తోంది.

## National Disaster Response Force (NDRF), State Disaster Response Force (SDRF)

ప్రకృతి, మానవ తప్పిదాల వల్ల జరిగే వైపరీత్యాల్లో అతి శీఘ్రంగా స్పందించి.. సహాయ, పునరావాస కార్యక్రమాలను అందించేందుకు పూర్తిస్థాయి శిక్షణ కలిగిన వ్యక్తులు, అధునాతన యంత్ర పరికరాలతో 'నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్'ను ఏర్పాటు చేశారు. దీనికోసం కేంద్రం 8 పారా మిలిటరీ దళాలను కేటాయించింది. అలాగే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ అధీనంలోని సర్వీసుల నుంచి కొన్ని దళాలను కేటాయించాలని నిర్దేశించింది. ఈ విపత్తు నిర్వహణ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి స్థానిక సంస్థల నుంచి దాదాపు 30 లక్షల మంది ప్రతినిధులు పాల్గొంటారు. వీరితో పాటు NCC, NSS, హోంగార్డు బలగాలు, నెహ్రూ యువజన కేంద్రాల (NYKS )నుంచి వాలంటీర్లు విపత్తుల సమయంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

## National Institute of Disaster Management (NIDM)

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే మానవ వనరులను తయారు చేయడానికి, సామర్థ్యం పెంపు, తగిన శిక్షణ ఇవ్వడం, పరిశోధన చేసి సరైన సమాచార నిధిని రూపొందించడం వంటి లక్ష్యాలతో 2003 అక్టోబర్ 16న NIDMను ఏర్పాటు చేశారు. దీనికి కేంద్ర హోంమంత్రి అధ్యక్షుడిగా, NDMA ఉపాధ్యక్షుడు ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 1995లో ఏర్పాటు చేసిన National Centre for Disaster Management (NCDM) పేరును NIDM గా మార్చారు. దేశంలో కేంద్ర రాష్ట్ర స్థాయిల్లో ప్రభుత్వ ప్రభుత్వేతర, స్థానిక సంస్థలు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, అంతర్జాతీయ స్థాయిలో వివిధ విపత్తులకు సంబంధించిన సంస్థల సమన్వయంతో విపత్తులను ఎదుర్కోవడానికి తగిన మార్గదర్శకాలను, నష్ట నివారణ చర్యలను రూపొందించడం, మానవ వనరులను తయారు చేయడం దీని పని. అంతేకాక రాష్ట్రస్థాయిలో విధివిధానాలు రూపొందించడంలో రాష్ట్రాలకు తగిన సలహాలు, సూచనలు చేయడం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం వంటి పనులు చేస్తుంది.

## NDRF:

విపత్తులకు గురైన వారికి తక్షణ సహాయం అందించడానికి జాతీయ స్థాయిలో ఇది వరకే రూ. 500 కోట్లతో ఉన్న National Calamity Contingency Fund(2001 లో ఏర్పాటైంది), Calamity Relief Fund ను 2010లో National Disaster Response Fund గా మార్చారు. 13వ ఆర్థిక సంఘం సూచన మేరకు ఈ రెండింటిని కలిపి NDRF ఏర్పాటు చేశారు. Calamity Relief Fundను రాష్ట్రస్థాయిలో బాధితులకు తక్షణ సహాయం అందించడానికి 2000లో ఏర్పాటు చేశారు. 2000–05 వరకు దాదాపు రూ. 11,007 కోట్ల నిధులు అందచేశారు. దీనిలో కేంద్రం వాటా 75 శాతం, రాష్ట్రం వాటా 25 శాతం. విపత్తుల సమయంలో రాష్ట్రం బాధితులకు నిధులు అందించలేని స్థితిలో NDRF నుంచి నిధులు కోరవచ్చు. National Executive Committee (NEC) చేసిన సిఫార్సుల మేరకు ఆయా రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తారు. గత ఐదారు సంవత్సరాల్లో రాష్ట్రాలకు విడుదల చేసిన నిధుల్లో కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్,

అస్సాం రాష్ట్రాలకే దాదాపు 86 శాతం నిధులు విడుదల చేశారు. వీటి కింద సునామీలు, భూకంపం, కరువు, వరదలు, అగ్ని ప్రమాదాల బాధితులకు తక్షణ ఉపశమనం, వెంటనే ఆవాసం, ఆహారం అందించడం, వంటి కార్యక్రమాలు చేపడతారు.

## SDMA, DDMA:

రాష్ట్రం, జిల్లాస్థాయిలో విపత్తు నిర్వహణ బాధ్యతను నిర్వహించడానికి State Disaster Management Authority, District Disaster Management Authority ను ఏర్పాటు చేశారు. SDMA కు రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లాల్లో కలెక్టర్ లేదా మెజిస్ట్రేట్ DDMAకు అధ్యక్షుడిగా ఉంటారు. విపత్తు నిర్వహణకు కావాల్సిన విధివిధానాలను రూపొందించడం వీటి బాధ్యత. రాష్ట్రస్థాయిలో State Executive Committeeని ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. దీనికి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇవి విపత్తుల సమయంలో త్వరితగతిన స్పందించడం, ఉపశమనం కలిగించడం, పునరావాసం కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాయి. స్థానిక సంస్థలైన పంచాయతీలు, కంటోన్మెంట్ బోర్డులు, పట్టణ ప్రణాళిక సంస్థలను భాగస్వాములను చేస్తూ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తగిన ప్రణాళికలను రూపొందిస్తారు. విపత్తు నిర్వహణ సంస్థలకు మండల స్థాయిలో బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

సమాజ శ్రేయస్సులో భాగంగా అమలవుతున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక పథకాల ద్వారా చాలా వరకు విపత్తులను నివారించవచ్చు. PMGY, ఇందిరా అవాస్ యోజన కింద ప్రమాణాలకు అనుగుణంగా గృహనిర్మాణం చేపట్టడం, JNNURMలో భాగంగా పట్టణాలు, నగరాల్లో తగిన సౌకర్యాలు కల్పించడం, SGSY, NRLM, MNREGAతో స్వయం ఉపాధి కల్పించడం, DPAP, DAP పథకాల్లో భాగంగా ప్రాంతీయ అభివృద్ధి సాధించడంతో దేశంలో పేదరికాన్ని తగ్గించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణ స్థాయిని మెరుగుపరచవచ్చు. విపత్తుల తీవ్రతను తగ్గించవచ్చు.

## National Executive Committee

దీనికి కేంద్ర హోం కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. దీంతో పాటు అన్ని మంత్రిత్వ శాఖల కార్యదర్శులు సమావేశాల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారు. డిజాస్టర్స్‌పై విధివిధానాలు రూపొందించడం, నిర్వహణ, NDMA విడుదల చేసిన మార్గదర్శకాలు అమలయ్యేలా చూడటం దీని విధి.

ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు పూర్తిగా విపత్తులను నివారించలేకపోవచ్చు. కానీ భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించుకొని విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తోడ్పడుతాయి. మనం అనుకున్నట్లు అన్ని విధాల అభివృద్ధి చెందిన విపత్తులు లేని భారత్‌ను చూడాలంటే ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వహించాలి.

SAARC Disaster Management Centre: 2004 సునామీ తర్వాత సార్క్ దేశాల పర్యావరణ మంత్రులు 25, జూన్ 2005లో మాలెలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైపరీత్యాలను ముందుగా హెచ్చరించే సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పరుచుకోవడానికి ఒక నిపుణుల బృందాన్ని నియమించారు. ఈ కమిటీ తయారు చేసిన ఫ్రేమ్‌వర్క్‌ను సార్క్ మంత్రుల బృందం 2006లో 14వ సమావేశంలో ఆమోదించారు. ఈ విధంగా 2006 అక్టోబర్‌లో ఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఏర్పడిందే SDMC. NIDM పరిసరాల్లోనే దీనిని ఏర్పాటు చేశారు. దీనికి చైర్మన్‌గా సభ్యదేశాల్లోని అధికారులు ఒకరి తర్వాత ఒకరు (ఆల్ఫాబెటికల్ ఆర్డర్) నియమితులవుతారు. ప్రస్తుత చైర్మన్ R K శ్రీవాస్తవ(భారత్). విపత్తులను ఎదుర్కోవడానికి కావాల్సిన విధాన నిర్ణయాలు చేయడానికి సార్క్ సభ్యదేశాలకు తగిన సలహాలు సూచనలు చేయడం, సమాచార మార్పిడి, పరిశోధన, వ్యూహాత్మక రచన వంటి కార్యకలాపాలను ఇది నిర్వహిస్తుంది. దీని వెబ్‌సైట్: sarc.sdmc.nic.in

## India Disaster Management Congress

First India Disaster Management Congress: ఇది 2006 నవంబర్ 29–30 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగింది. విపత్తుల తీవ్రతను తగ్గించడానికి వీలైనన్ని సూచనలు, సలహాలు చేయడం, విపత్తులను సమర్థవతంగా ఎదుర్కోవడం వంటి అంశాలను చర్చించడం కోసం మొదటి విపత్తు నిర్వహణ కాంగ్రెస్‌ను నిర్వహించారు. దీనిని ప్రధాని మన్మోహన్ ప్రారంభించారు. 1200 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు పాల్గొని చర్చించారు.

Second India Disaster Management Congress: మొదటి కాంగ్రెస్ విజయవంతం కావడంతో NDMA 2009 నవంబర్ 4–6 వరకు రెండవ విపత్తు కాంగ్రెస్‌ను నిర్వహించింది. ఈ సమావేశంలోనే విపత్తు నిర్వహణపై జాతీయ విధానాన్ని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. విపత్తులను తగ్గించడం, సమర్థవంతంగా ఎదుర్కోవడం, సంసిద్ధత, ఉపశమనం, పునరావాసం, పునర్నిర్మాణం, సహాయక చర్యలు, ఆర్మీ దళాలు, రెస్పాన్స్ ఫోర్స్ పాత్ర స్వచ్ఛంద సంస్థల, మీడియా పాత్ర, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అనేక అంశాలపై తీవ్రంగా చర్చించారు. ప్రత్యేక దళాలకు శిక్షణనిచ్చి వారిని సమర్థవంతంగా విపత్తుల సమయంలో స్పందించేలా తయారు చేయాలని సూచించారు. ప్రపంచంలో ఇప్పటి వరకు నిర్వహించిన విపత్తు నిర్వహణ కాంగ్రెస్ సమావేశాల్లో ఇదే అతి పెద్దది కావడం విశేషం.